క్లుప్తంగా

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

బూర్గంపాడు: ఐటీసీ ఆధ్వర్యంలో బూర్గంపాడు, నాగినేనిప్రోలులోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న బాలికలకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో విద్యాభివృద్ధికి ఐటీసీ అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. అనంతరం బూర్గంపాడులో నూతనంగా నిర్మించిన వాటర్‌ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీసీ డీజీఎం(హెచ్‌ఆర్) చెంగలరావు, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంఈఓ యదుసింహరాజు, ఎంపీఓ బాలయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బట్టా విజయ్‌గాంధీ, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

దుమ్ముగూడెం: ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19, 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లో జరగబోయే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో–2025 పోస్టర్లను స్థానిక ఫొటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రుక్మా రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మడకం మహేంద్రనాథ్, మండల కోశాధికారి శ్యామల రవివర్మ, ఫొటోగ్రాఫర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా శ్రీరామ్మూర్తి, మండల కార్యదర్శి దారిశెట్టి రవి, సభ్యులు రాజు, పవన్, శ్రీరామ్, రమేష్, సూర్య, రామారావు పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో మినరల్‌వాటర్ సరఫరా

దుమ్ముగూడెం: మండలంలోని వర్క్‌షాపు గ్రామంలో గత మూడు రోజుల నుంచి మంచినీరు రాక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో యలమంచి సీతారామయ్య ట్రస్ట్ ద్వారా యలమంచి శ్రీనుబాబు ఆధ్వర్యంలో మంగళవారం మినరల్ వాటర్ సరఫరా చేశారు. కార్యక్రమంలో సుత్తిరామకృష్ణ, కట్టమూరు వేణు, సాల్మన్, గుడివాడ శీను, తోకల సమ్మయ్య, చెలికాని పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

యోగా శిబిరం విజయవంతం


యోగా గురువు నరేష్‌ను సన్మానిస్తున్న కమ్మ సేవా సమితి చైర్మన్ జగదీష్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణం కమ్మ సత్రంలో ఉన్న ఆడిటోరియంలో ఆగస్టు 11 నుంచి సెప్టెంబర్ 9 వరకు శిక్షకుడు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా శిక్షణ విజయవంతమైంది. శిబిరాల్లో భద్రాచలం పట్టణానికి చెందిన పలువురు పాల్గొన్నారు. యోగా శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం యోగా గురువు నరేష్‌ని కమ్మ సేవ సమితి చైర్మన్ అడుసుమిల్లి జగదీష్, సభ్యులు రామారావు, వీరయ్య, చావా లక్ష్మీనారాయణ, సత్యనారాయణలు శాలువాతో ఘనంగా సన్మానించారు. టీఎన్టీయూసీ రికగ్నైజ్ యూనియన్ అధ్యక్షుడు కనకమెడల హరిప్రసాద్, బీవీ రమణారెడ్డి, ఐటీసీ కాంట్రాక్టర్ కేవీఆర్ పాల్గొన్నారు.

రైతువేదికలో యూరియా

అశ్వాపురం: తుమ్మలచెరువు రైతులకు పీఏసీఎస్ కేంద్రం దూరంగా ఉండటం వల్ల యూరియా పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను అధిగమించడానికి రైతువేదిక వద్ద యూరియా పంపిణీ చేస్తున్నామని వ్యవసాయ శాఖ ఏడీఏ తాతారావు అన్నారు. మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో రైతువేదికలో మంగళవారం రైతులకు యూరియా కట్టలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. సమావేశంలో ఏఈఓ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

సరిపడా సరఫరా చేయాలి

చంద్రుగొండ: రైతులు సేద్యం చేసిన పంటలకు సరిపడా యూరియాను ప్రభుత్వం సత్వరమే సరఫరా చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన రైతులతో కలిసి యూరియా కొరతపై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు ఇస్లావత్ వస్రాం, ధన్య, శంకర్, సామ్య, రమేష్, రామారావు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీలు

పినపాక: కరకగూడెం–పినపాక మండలాల జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. మండలాలలో వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు కబడ్డీ, కోకో, వాలీబాల్ వంటి క్రీడల్లో పాల్గొని వారి సత్తా చాటారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని అధికారులు తెలిపారు. అంతకుముందు జోనల్ స్థాయి క్రీడలను ఎంఈఓ నాగయ్య, ఎస్‌ఐ సురేష్, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీఓ సునీల్ కుమార్ పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు.

సమష్టిగా 'వినాయక విజయం'

- ఐదు రోజులు విధుల్లో అన్ని శాఖల ఉద్యోగులు
- భద్రాచలంలో ప్రశాంతంగా ముగిసిన గణపతి నిమజ్జనం


బందోబస్తుపై సమీక్షిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు (ఫైల్)


భద్రాచలంలో నిమజ్జన ఘాట్ వద్ద సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్.వి.పాటిల్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని గోదావరి నదిలో వారం రోజులుగా కొనసాగుతున్న వినాయక విగ్రహల నిమజ్జనం మంగళవారం ప్రశాంతంగా పూర్తయింది. పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, వైద్య శాఖల అధికారులు, సిబ్బంది సమష్టిగా విధులు నిర్వర్తించడంతో అంతా సాఫీగా సాగింది. చివరి రెండురోజులు రెప్ప వాల్చకుండా పోలీసులు, గ్రామపంచాయతీ, మత్స్య శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు పనిచేయడంతో ఏ లోటుపాట్లు ఎదురుకాలేదు.

కలెక్టర్ ఆదేశాలతో..

రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్, వైద్య తదితర శాఖలన్నీ వినాయక ఉత్సవాల ప్రారంభానికి ముందు నుంచే ఏర్పాట్లపై దృష్టి సారించాయి. మండపాలకు అనుమతి, విద్యుత్ కనెక్షన్లు, వేలాడుతున్న తీగల తొలగింపు, తాగునీటి వ్యవస్థ, రూట్ మ్యాప్, గోదావరి వద్ద నిమజ్జన ఘాట్ల ఏర్పాట్లు.. ఇలా అన్నిపనులను సమష్టిగా ఉత్సవాల విజయవంతానికి పాటుపడ్డారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్ రాజు, సబ్ కలెక్టర్ శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉద్యోగులకు సూచనలుచేశారు. అవాంఛనీయ ఘటనలకు జరగకుండా పోలీసు శాఖ నిరంతరం గస్తీ కాసింది. భద్రాచలం గోదావరి నదిలో మొత్తం 1,612 పెద్ద విగ్రహాలతో పాటు 1500 వరకు చిన్న విగ్రహాలను నిమజ్జనం చేశారు.


రాత్రివేళ ఘాట్ వద్ద పరిశీలిస్తున్న జడ్జి శివనాయక్, పీఓ రాహుల్, ఏఎస్పీ విక్రాంత్ (ఫైల్)


మంగళవారం భారీ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

ఉన్నతాధికారుల ఆదేశాలతోనే..



గోదావరిలో వారం రోజుల పాటు నిమజ్జనం విజయవంతంగా కొనసాగింది. కలెక్టర్, ఐటీడీఏ పీఓ, సబ్ కలెక్టర్ ఆదేశాలతో చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలను ఇచ్చాయి. అన్నిశాఖల ఉద్యోగుల సమన్వయంతో ఇది సాధ్యమైంది.

– శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ, భద్రాచలం

స్వయంగా నిమజ్జనం చేశాం..



గోదావరిలో లాంచీల ద్వారా విగ్రహాలను నిమజ్జనం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. తొమ్మిది రోజుల పాటు మండపాలలో భక్తులు పూజించిన విగ్రహాలను నా చేతులతో నిమజ్జనం చేయడం మర్చిపోలేను.

– కరకు ప్రసాద్, గజ ఈతగాడు, భద్రాచలం

డిజిటల్ విద్యపై ఆసక్తి పెంచాలి


మాట్లాడుతున్న జిల్లా మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్

మణుగూరురూరల్: విద్యార్థులకు డిజిటల్ విద్యపై ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని జిల్లా మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ కోఎడ్యుకేషన్ ఉన్నత పాఠశాలలో జరిగిన పాఠశాలల సముదాయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు సాంకేతిక విద్యపై అధ్యయనం చేసి విద్యార్థులకు డిజిటల్ విద్యను సులభమైన రీతిలో బోధించాలని సూచించారు. అలాగే టిఎల్‌ఎం మేళా వంటివి నిర్వహించి విద్యార్థుల్లో నైపుణ్యాన్ని మరింత మెరుగుర్చాలన్నారు. సమావేశంలో మణుగూరు ఎంఈఓ స్వర్ణజ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.నాగశ్రీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యశోద, శ్రీలత, రీసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చంద్రుగొండ: మండలంలోని చంద్రుగొండ రేంజ్ పరిధి మద్దుకూరు తూర్పు బీట్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు రేంజర్ ఎల్లయ్య తెలిపారు. అటవీప్రాంతంలోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేయగా అన్నపురెడ్డిపల్లికి చెందిన రెండు ట్రాక్టర్లు ఉండడంతో సీజ్ చేశామని వెల్లడించారు. అలాగే, ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీఎల్‌ఎం మేళా..

కరకగూడెం: మండల స్థాయి ఉపాధ్యాయుల టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళా కరకగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ మేళాను మండల విద్యాశాఖ అధికారిణి మంజుల ప్రారంభించారు. ఉపాధ్యాయులు తమ సృజనాత్మకతతో రూపొందించిన బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించారు. ఈ మేళాలో ఎంపికైన ఉపాధ్యాయులు రాబోయే జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని ఎంఈఓ తెలిపారు.

దోమలమందు పిచికారీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని శ్రీరంగాపురం, శాంతినగర్ గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం దోమల మందు పిచికారీ చేశారు. అనంతరం గృహసందర్శన చేసి పరిసరాలను పరిశీలించారు. కంటైనర్లలో నిల్వ నీటిని పారబోయించి శుభ్రం చేయించారు. అనంతరం వైద్యసిబ్బంది గ్రామస్తులకు పలు సూచనలు ఇచ్చారు. నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా యాంటీలార్వా ద్రావణాన్ని చల్లారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ అరుణ్‌బాబు, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, కౌసల్య, ప్రమీల, వాణిశ్రీ పాల్గొన్నారు.

భగీరథ కార్మికులకు అండగా ఉంటాం..

దుమ్ముగూడెం: జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నా మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ యండి.జానీపాషాలు అన్నారు. గత 5 రోజులుగా తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పర్ణశాల వద్ద మిషన్ భగీరథ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాముడు, జానీపాషాలు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాస్, లంకా శివ, గోసంగి కిరణ్, అప్పన, సుధాకర్, కంటెం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోషణ వారోత్సవం

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం గిరిజన మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో పోషణ వారోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్పందన మాట్లాడుతూ.. పోషకాహారం ప్రాముఖ్యతను వివరించి, ఆరోగ్య సూత్రాలను గురించి విద్యార్థులకు తెలియజేశారు. పలురకాల కూరగాయాలు, వాటిలో ఉండే పోషక విలువలను, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సింధుశ్రీ, లైబ్రరీయన్ అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

దుమ్ముగూడెం: ఇటీవల జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన 25 మందిని మండలంలోని నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈఓ సున్నం సమ్మయ్య, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఏవీ రామారావు , బెక్కంటి శ్రీనివాసరావులు ఘనంగా సన్మానించారు. మెమెంటో అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు దశం బాబు, శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, జయబాబు, సంఘం శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయ పోరాటానికి సిద్ధం కావాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చిస్తున్న ఆదివాసీ నాయకులు

దుమ్ముగూడెం: ఎస్టీ రిజర్వేషన్ నుంచి లంబాడీలను తొలగించాలని సుప్రీం కోర్టులో కేసు వేసిన నేపథ్యలో న్యాయ పోరాటానికి ఆదివాసీలు సిద్ధం కావాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నడికుడి గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివాసీ సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీలు న్యాయబద్ధంగా కోట్లడుతుంటే తమను కొందరు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ముర్రం వీరభద్రం, కుంజా శ్రీనివాస్, కొమరం దామోదరావు, వరుస ముద్దరాజు, సోందె మల్లురు, రేసు ఆదినారాయణమూర్తి, తునికి కామేష్ ,కనితి రాముడు, తెల్లం హరికృష్ణ, కొరస నరేష్ ,సోయం కామరాజు, కారం రమేష్, సరియం కోటేశ్వరరావు, మహిళా నాయకురాలు తెల్లం సీతమ్మ, రేసు లక్ష్మి, వాగే రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పాదయాత్ర

బూర్గంపాడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన సారపాక నుంచి భద్రాచలం ఐటీడీఏ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మువ్వ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం సారపాకలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోడుభూములకు పట్టాలిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. పార్టీ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలకృష్ణ, సాడే చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ సేన ఆవిర్భావ వేడుక


నినాదాలు చేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

మణుగూరుటౌన్: సేవాలాల్ సేన ఆవిర్భవించి 10 సంవత్సరాలు పూర్తి చేసుకుని 11 సంవత్సరాల్లోకి అడుగు పెట్టిన సందర్భంగా సేన ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెండా ఆవిష్కరించి వక్తలు మాట్లాడారు. బంజారా సమాజానికి ఎస్టీ జాబితా నుంచి తొలిగించేందుకు కొందరు అగ్రవర్ణాల నాయకులు, అమాయకులైన ఆదివాసీలను ఉసిగొల్పుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ సమన్వయకర్త ఇస్లావత్ కోటియా నాయక్, మండల నాయకులు ఇస్లావత్ ద్వాలి, గుగులోత్ కవి, గుగులోత్ రవి నాయక్, గుగులోత్ రమేష్, భుక్యా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

ములకలపల్లి: ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో కనకయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి మెరుగైన వైద్యం అందేలా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు ముదిగొండ రాంబాబు, వెంకటేశ్వర్లు, మధు, అమల పాల్గొన్నారు.

సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ

అశ్వారావుపేటరూరల్: సీపీఐ సీనియర్ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను మున్సిపాలిటీ పరిధిలోని సిద్ది వెంకటేశ్వరనగర్‌లో మంగళవారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌డీ సలీం ఆధ్వర్యంలో సుధాకర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాల ఘనంగా నివాళులర్పించారు. నాయకులు గన్నిన రామకృష్ణ, విజయ్‌కాంత్, జక్కం బలరాం, సత్యవతి, ఎస్‌కే రసూల్, సూర్య కుమారి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రేగా పరామర్శ

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీలో కాలికి గాయమైన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త సునీల్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మంగళవారం వారి గృహానికి వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ జంపేశ్వరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు నిండినా అందని నీరు

- మరమ్మతుకు గురైన తుమ్మల చెరువు షట్టర్లు
- పట్టింపులేని అధికారులు


తుమ్మల చెరువు తూము వద్ద షట్టర్ల మరమ్మతుకు ప్రయత్నిస్తున్న రైతులు

అశ్వాపురం: మండలంలో ప్రధాన సాగు నీటి వనరు అయిన తుమ్మలచెరువు ఆయకట్టు కింద రైతులు గత 20 రోజులుగా నీరు అందక వరి పొలాలు ఎక్కడికక్కడికి ఎండిపోతున్నాయి. తుమ్మల చెరువులో 20 అడుగులు నీళ్లతో నిండుకుండలా ఉన్నప్పటికీ చెరువు రెండు తూముల షట్టర్లు పనిచేయకపోవడంతో పొలాలకు నీరు రావడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం శూన్యమని రైతులు వాపోతున్నారు. రైతులే జేసీబీ యంత్రాల ద్వారా 20 అడుగుల లోతులో పట్టేసిన తూముల షట్టర్లు మరమ్మతులు చేసుకునేందుకు ప్రయత్నించిన ఫలించలేదు. ఈ తూము షట్టర్లు ఓపెన్ చేయకపోతే.. ఇప్పటికే నిండుకుండలా ఉన్న తుమ్మలచెరువు కట్ట తెగే పెనుప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి షట్టర్లు మరమ్మతు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. అధికారులు స్పందించక పోతే ఆందోళనలు చేస్తామని అంటున్నారు.

కర్మయోగి అభియాన్‌తో లబ్ధి


అన్నపురెడ్డిపల్లి: శిక్షణలో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్

పినపాక: గిరిజన పరివర్తన, వ్యక్తులు, సంస్థలకు సాధికారత కోసం.. ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో, నోడల్ ఆఫీసర్ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం పినపాక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. గ్రామ స్థాయి శిక్షణ అధికారులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, కార్యక్రమాన్ని ఐటీడీఏ ఏఓ రాంబాబు సందర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ హనుమంతు, రాంబాబు, సీసీ సాంబశివరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని తొట్టిపంపు గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో ఆదికర్మయోగి అభియాన్‌పై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్, ఎంపీడీఓ మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్యప్రకాష్

అశ్వాపురం: లయన్స్‌క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్ ఆధ్వర్యంలో అశ్వాపురం జెడ్పీ స్కూల్‌లో లయన్స్ క్వెస్ట్ టీచర్ ట్రైనింగ్ వర్క్‌షాపును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ బాధ్యులు మాట్లాడుతూ.. సుమారు 30 మంది ప్రభుత్వ టీచర్లకు రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యా నైపుణ్యాల, సామాజిక ప్రవర్తన, కౌమారదశలోని మార్పులు–సవాళ్లు తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని, తద్వారా వెనుకబడిన ప్రాంతంలో వెయ్యి మంది విద్యార్థులు విద్యావంతులు అవడం లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ స్టార్ అధ్యక్షుడు నల్లగట్ల సత్యప్రకాష్, సభ్యులు నంబూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ బీవీ.సత్యనారాయణ, గుర్రం నాగేశ్వరరావు, అరుణాచారి, మణుగూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మీరా హుస్సేన్, మణుగూరు విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సురేష్, సెక్రటరీ కృష్ణ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. కాళోజీ తన సాహిత్యంతో తెలంగాణ అస్తిత్వాన్ని తట్టిలేపి స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించారని కొనియాడారు. తెలంగాణ యాస, భాష, సంస్కృతి పరిరక్షణకు కాళోజీ చేసిన కృషిని గుర్తు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో కాళోజీ చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి..


మణుగూరుటౌన్: జీఎం కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు


అశ్వారావుపేటరూరల్: మున్సిపల్ కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో..


అశ్వాపురం: తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ జయంతి వేడుకలు


అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ కళాశాలలో డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో..


దుమ్ముగూడెం: తెలుగు అధ్యాపకుడిని సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు


అన్నపురెడ్డిపల్లి: జ్యోతిబాపూలే గురుకులంలో కాళోజీ జయంతి..